ఆంధ్రజ్యోతి

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శుక్రవారం 29 నవంబరు 2024



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్‌లో కుళ్లిపోయిన టమాట

వేలేరు బాలుర గురుకులంలో విద్యార్థులకు వడ్డించిన దొడ్డు బియ్యం అన్నం

బాబోయ్.. బడి బువ్వ!

ఉడికీ ఉడకని అన్నం.. రుచీపచీ లేని కూరలు.. చారును తలపించే పప్పు.. ఉప్పు, పప్పు లేని చారు.. ప్రమాణాల మేరకు లేని గుడ్లు.. ఇదీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన తీరు. సర్కారు బడుల్లో చదువుకునే చిన్నారులు.. ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే అవసరం లేకుండా పాఠశాలల్లోనే వారికి ప్రభుత్వమే మధ్యాహ్న భోజన వసతి కల్పించింది. ఇందుకోసం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తూ.. ఆ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించింది. ఈ క్రమంలో మెజారిటీ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందడం లేదని, మెనూ ప్రకారం కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారాలను అందించడం లేదని తెలుస్తోంది. అంతేకాదు సరైన వంట షెడ్లు, డైనింగ్‌హాళ్లు, నీటి కుళాయిలు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాలోని రెండు పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం తిన్న తర్వాత పదుల సంఖ్యలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. ఇక కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ విద్యార్థిని 20రోజుల పాటు చికిత్స పొంది కన్నుమూసింది. ఈ ఘటనల తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 'బాబోయ్.. బడి బువ్వ' అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సర్కారీ బడుల్లో మిడ్‌డే మీల్స్ నిర్వహణ తీరుపై గురువారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

- ఉమ్మడి వరంగల్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



వేలేరు బాలుర గురుకులంలో సిబ్బంది లేక భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సక్రమంగా అందని మధ్యాహ్న భోజనం
- ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీలేని కూరలు వడిస్తున్న నిర్వాహకులు
- మెనూ పాటించడంలోనూ నిర్లక్ష్యం.. పలుచోట్ల కానరాని గుడ్డు
- వంటషెడ్లు లేక ఆరుబయట వంట, చెట్ల కింద భోజనాలు

పాటించాల్సిన మెనూ..

- సోమవారం: కిచిడీ, మిక్స్‌డ్ వెజిటేబుల్‌కర్రీ, గుడ్డు.
- మంగళవారం: రాగి జావ, అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ.
- బుధవారం : అన్నం, ఆకుకూరలు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు.
- గురువారం: రాగి జావ, విజిటేబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ.
- శుక్రవారం : అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటేబుల్‌కర్రీ, గుడ్డు.
- శనివారం : రాగి జావ, అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్‌కర్రీ.

వివరాలు 7లో..



జఫర్‌ఘడ్ మోడల్ స్కూల్‌లో గుడిసెలో వంట..



మరిపెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...



కొడవటూరు పాఠశాలలో



తాడ్వాయి మండలం ఇందిరానగర్ జడ్పీహైస్కూల్‌లో..



కాటారంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆరుబయట వంట

కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

కాజీపేట వ్యాగన్ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేసిన రైల్వే శాఖ

ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీ

సెప్టెంబరు 9నే ఉత్తర్వులు.. ఆలస్యంగా వెలుగులోకి

ఓరుగల్లు వాసులకు మరో విభజన హామీని నెరవేర్చిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌ను అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 55ఏళ్లుగా కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రజలు, రైల్వే ఉద్యోగులు చేస్తున్న పోరాటం ఫలించినట్టయ్యింది. కోచ్‌ఫ్యాక్టరీతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. 2014 ఏపీ విభజన హామీల్లో భాగంగా ఉమ్మడి ఓరుగల్లుకు సంబంధించి మరో హామీని కేంద్రం నేరవేర్చినట్లైంది. ఇప్పటికే గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసిన కేంద్రం తాజాగా కోచ్ ఫ్యాక్టరీని కూడా మంజూరు చేయటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వ్యాగన్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్..

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది. 1969 నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం చేస్తున్న పోరాటం ఫలించింది. గతేడాది

మిగతా 6వ పేజీలో...



దీక్షా దివస్‌తో ప్రజాక్షేత్రంలోకి..

- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో స్తబ్ధుగా గులాబీ దళం
- కేడర్‌లోని నైరాశ్యాన్ని చెరిపేలా బీఆర్ఎస్ కార్యాచరణ
- నేడు జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, దీక్షా శిబిరాలు
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపైన గులాబీ పార్టీ నజర్
- నాటి కేసీఆర్ దీక్షతో పోరెత్తిన ఓరుగల్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గులాబీ పార్టీని వరుస ఓటములు నైరాశ్యంలోకి నెట్టాయి. అసెంబ్లీ, పార్లమెంట్‌తో పాటు ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఎదురైన పరాభవాలతో బీఆర్ఎస్‌లో స్తబ్ధత నెలకొంది. గ్రామస్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు నిరాసక్తతో తమదైన రోజు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాడర్‌లో జోష్ నింపడంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినాయకత్వం భారీ కసరత్తు చేస్తోంది. 2009 నవంబరు 29న కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ చేసిన ఆమరణ దీక్షకు 15ఏళ్లు కావటంతో దీక్షా దివస్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ దీక్షాదివస్ వేదికగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి.. కేసీఆర్ దీక్షతోనే రాష్ట్రం సిద్ధించిందని ప్రజల కు మళ్లీ గుర్తుచేసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించిన బీఆర్ఎస్ శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, దీక్షలతో దీక్షా దివస్‌ను సక్సెస్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంది.


పరాజయాలతో గులాబీ దళంలో నైరాశ్యం

తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచింది ఓరుగల్లు. 2014, 2018లో గులాబీ దళానికి జైకొట్టి.. భారీగా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను ఇచ్చిన వరంగల్ ప్రజలు 2023లో మాత్రం భారీ షాక్ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే కేవలం రెండు చోట్లనే బీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపారు. తెలంగాణ ఉద్యమకారులు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో పాటు నాడు మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం ఓటమిపాలయ్యారు. ఆ తరువాత ఆరు నెలలకే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ పార్టీకి పరాజయమే మిగిలింది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పాగా వేసింది. వరంగల్ ఎంపీ స్థానంలో దారుణంగా మూడో స్థానానికి గులాబీ పార్టీ పరిమితమైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లోనూ ఓడిపోయింది. మూడు పర్యాయాలు వరుసగా గెలిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కూడా ఓటమి చెందడం గులాబీ శ్రేణులను మరింతగా కుంగదీసింది. దీంతో కొంతకాలంగా బీఆర్ ఎస్ శ్రేణులు అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు కూడా నియో జకవర్గాలకు చుట్టపు చూపులా వచ్చిపోతున్నారు. దీంతో కార్యకర్తల్లోనూ నైరాశ్యం ఏర్పడింది. ఈ క్రమంలో క్యాడర్‌లో జోష్ నింపేందుకు ప్రజాక్షేత్రం లోకి వెళ్లాలని బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది.

దీక్షాదివస్‌తో కార్యాచరణ

కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ 2009 నవంబరు 29న గులాబీ దళపతి ఆమరణ దీక్షకు దిగి 15ఏళ్లవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కూడా ఏడాది కాలం కావస్తుంది. దీంతో ఇన్నాళ్లు స్తబ్ధుగా ఉన్న గులాబీ దళం దీక్షా దివస్ వేదికగా ప్రజ ల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టింది. నాటి కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఉద్యమం ఊపందు కుందని ప్రచారం చేస్తోంది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ప్రతీ గ్రామంలోనూ ఉద్యమ జ్ఞాపకాలున్న నేపథ్యంలో ఆ సెంటిమెంట్‌గా రగిలిస్తూనే కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధానంగా రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు రూ.2,500 సాయం, రూ.4వేలకు పెరగని పింఛన్లు తదితర వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇందుకోసం ఉమ్మడి వరంగల్‌లోని అన్ని జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు మాజీ

మిగతా 6వ పేజీలో...



పోలీసుల అదుపులో నిందితులు?

మహదేవపూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రుపల్లి శివారులో బుధవారం రాత్రి జరిగిన హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించినట్టు తెలుస్తోంది. ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. నిందితులను శుక్ర లేదా శనివారం రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మొగుళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పిడిసిలకు చెందిన గడ్డం జనార్దన్(65) టీబీ, ఆస్తమాతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 25న పురుగులమందు తాగాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య తారమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. .

WANTED TEACHERS
Primary : English, Maths
(English Medium background Candidates)
Free Transportation Facility from Tricities to Parkal
SHARADA VIDYALAYAM HIGH SCHOOL - PARKAL
Cont : 6300947774, 9652177306



మల్లంపల్లి గ్రామం



మల్లంపల్లిలో సంబరాలు చేసుకుంటున్న జేఏసీ నాయకులు, యువకులు

మండలంగా మల్లంపల్లి

- తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- ములుగు జిల్లాలో పదికి చేరిన మండలాల సంఖ్య

ములుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లి ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ములుగు మండలంలోని మల్లంపల్లి, రాంచంద్రాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని పది గ్రామపం చాయతీలతో నూతన మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దీంతో ములుగు జిల్లాలో మండలాల సంఖ్య పదికి చేరింది.

మల్లంపల్లి ఏర్పాటు ఆకాంక్ష ఇప్పటిది కాదు. మొదటి విడతలో జిల్లాల పునర్విభజన జరిగినప్పటి నుంచీ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ములుగులో 2018లో జరిగిన ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ములుగు జిల్లాతోపాటు మల్లంపల్లి మండల ప్రస్తావన చేశారు. ఆ మరుసటి ఏడాది 2019 ఫిబ్రవరి 17న ములుగు జిల్లాగా ఆవిర్భవించిది కానీ, మండలం మాత్రం ఏర్పాటు కాలేదు. ఈ నేపథ్యంలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటం ప్రారంభించారు. ఇదే గ్రామానికి చెందిన దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ శతవిధాలా ప్రయత్నించారు. మండలాన్ని సాధించుకోకుండానే హఠాన్మరణం చెందారు. జగదీశ్‌పై సానుభూతితోనైనా మండలం వస్తుందని సర్వత్రా భావించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో జేఏసీని ఏర్పాటుచేసి మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేశారు.

పది పంచాయతీలతో..

గతేడాది సెప్టెంబరు 23న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ములుగు మండల పరిధిలోని మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలోని మల్లంపల్లి, రామచంద్రాపురం, శ్రీనగర్, భూపాల్‌నగర్, శివతండా, మహ్మద్‌గౌస్‌పల్లి, దేవనగర్, ముద్దునూరుతండా, కొడిశలకుంట, గుర్తూరుతండా, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కాట్రపల్లి రెవెన్యూ పరిధిలోని కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, సాధనపల్లి, రాజుపల్లి గ్రామపంచాయతీలను కలుపుతూ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే.. తొలుత అంగీకరించిన కాట్రపల్లి రెవెన్యూ గ్రామ ప్రజలు ఆతర్వాత మల్లంపల్లి మండలంలో అంతర్భాగంగా ఉండేందుకు విముఖత చూపారు. దీంతో మండల ఏర్పాటు ఆలస్యమైంది. ఆతర్వాత అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలు కాఆ అన్ని రాజకీయ పార్టీలకు మల్లంపల్లి మండలం ప్రధాన హామీగా మారింది. అధికార మార్పిడి జరగడం, ఎన్నికల్లో హామీనిచ్చిన సీతక్క విజయం సాధించి రాష్ట్రమంత్రి పదవి చేపట్టడంతో మండల ఏర్పాటు దిశగా చర్యలు చకచకా సాగాయి. దివంగత జడ్పీ చైర్మన్ జగదీశ్ పేరు కలిసేలా జేడీ మల్లంపల్లిగా నామకరణం చేస్తూ ఇటీవల గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో

మిగతా 8వ పేజీలో...

మాటకు కట్టుబడి ఉన్నాం : మంత్రి సీతక్క



కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదనడానికి మల్లంపల్లి మండల ఏర్పాటు నిదర్శనమని రాష్ట్ర పంచాయరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మండల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఓ ప్రకటనలో మంత్రి హర్షం వ్యక్తం చేశారు. మల్లంపల్లి వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లాలో పాదయాత్ర చేసిన సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజల ఆకాంక్షను గుర్తించి మల్లంపల్లిని మండలం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే మాటను నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, సహకారం అందించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

ఎస్.ఆర్.కె టీవీ
SRK TV
8174928054

ఆంధ్రజ్యోతి లో మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...

పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ ఆత్మీయులలో..
మీ సహోద్యోగులలో...
మీ కుటుంబ సభ్యులలో...
ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా ?
అందిస్తుంది సులువైన మార్గం పదవీ విరమణ ప్రకటనలకు
25%
EP లకు 15%
రాయితీ కల్పిస్తుంది
అలాంటి వారు తమ విధి నిర్వాహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి... పదవీ విరమణ శుభాకాంక్షల అక్షర సుమాంజలులు...
ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగము
సంప్రదించండి : 9985411172
హన్మకొండ : 9985411677, 9985411676
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354,
మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట : 9985418040
జయశంకర్ : 9985401232



జీవ పరిణామం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వానా బాషా

మూఢ నమ్మకాలను వీడాలి : కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జన విజ్ఞాన వేదిక(జీవీవీ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాల్లో చెకుముకి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేదాన్నే సైన్స్ అంటారని, విద్యార్థులు తరగతి గదిలో వినే పాఠాలను బయట ప్రాక్టికల్‌గా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. చెకుముఖి పోటీలో పాల్గొనేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను బాగా ప్రోత్సహించాలని, ప్రతి పోటీలో విద్యార్థులకు ఏదో ఒక కొత్త పరిజ్ఞానం వస్తుందన్నారు. అనంతరం జీవీవీ వేదిక ప్రచురించిన జీవ పరిణామం పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీఈవో రమేశ్, నిట్ ప్రొఫెసర్ కాశీనాథ్, ప్రిన్సిపాల్ మర్రెడి, జీవీవీ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

అధికారుల సస్పెన్షన్..

అవకతవకలకు పాల్పడిన అధికారులు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్య నిధుల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు అక్టోబరు 24న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షురాలు సుధ, కార్యదర్శి స్రవంతి, కోశాధికారి చైతన్య, డీపీఎం సమ్మక్కలు ఆగస్టులో 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రూ. కోటి 50లక్షల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. విచారణ జరిపిన కలెక్టర్ అదనపు డీఆర్డీవో(సేర్ప్) బోనగిరి శ్రీనివాస్, డీపీఎం సమ్మక్కలను సస్పెండ్ చేస్తున్నట్లు గురవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహా సమ్మేళనానికి గవర్నర్‌ను ఆహ్వానించిన సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో డిసెంబర్ మొదటి వారంలో జరిగే బంజారాల ధార్మిక వ్యాప్తి మహా సమ్మేళనానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహబూబాబాద్ మాజీఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం జిష్ణుదేవ్ వర్మను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ దేశంలో 12 కోట్ల మంది గిరిజనులు ఒకేవేష, బాష, భూషణ కలిగినటువంటి బంజారుల ఆధ్యాత్మి క గురువులు హతిరాం బాలాజీ, శ్రీసంతు సేవాలాల్ మహారాజ్ లాంటి మహనీయుల ఆధ్యాత్మికతను సమాజంలో పూర్తిస్థాయిలో వ్యాపింప చేయడమే ముఖ్యఉద్దేశమన్నారు. బంజారుల మత మార్పిడిలను అరికట్టడానికి ఆధ్యాత్మిక ప్రభావం ఉంటుందన్నారు. ఆయన వెంట బంజారాల నాయకులు డీటీ నాయక్, అమర్‌సింగ్ తిలావత్, ఉద్యోగసంఘాల నాయకులు రాంచందర్‌నాయక్, మోహన్‌సింగ్ నాయక్, రాజునాయక్, సాధువులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అజ్మీరా సీతారాం నాయక్ తదితరులు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకొని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో, ప్రముఖవైద్యుడు బానోత్ నెహ్రూరా రాథోడ్, ఎన్ఐటీ విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించి, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి, జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పొంపొందించటం అభినందనీయమన్నారు. విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే శాస్త్రీయ అవగాహన కలిగే విధంగా ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. డాక్టర్ నెహ్రూరాథోడ్ మాట్లాడుతూ విజ్ఞానాన్ని సరైన రీతిలో ఉపయోగించుకుంటూ సామాజిక వైద్యులు కావాలని విద్యార్థులకు సూచించారు. తొలుత ప్రొఫెసర్ కట్టా సత్యప్రసాద్ రచించిన జీవపరిణామం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏకశిలా హై స్కూల్, కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ జీవన్, లింగంపల్లి దయానంద్, మందుల శ్రీరాములు, సురేష్, బ్రహ్మం, ఉమాదేవి, ఏకాంతం, మంగపతిరావు, షైన నాగయ్య, ప్రసాద్‌రావు, సునీత, భాగ్యమ్మ, శ్రీనివాస్, యాకయ్య, రామ్మోహన్, నవీన్, నరేందర్, సాంబయ్య, చక్రధర్, ఓంప్రకాష్, నగేష్, మహిపాల్‌రెడ్డి, సుభాన్, రాజేశ్వరీ, సుందర్, విజయ్‌రాజ్, వీరభద్రం, రాజేశ్వర్, చంద్రశేఖర్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మందుల శ్రీరాములు ఇన్‌చార్జి హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, వసంత, రంజాన్ అలీ, రమేష్, సంజీవ, పద్మావతి, వీణ ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

18 తులాలకు పైగా బంగారు, 5 తులాల వెండి ఆభరణాలు దొంగతనం

కాటారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగలించిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం శంకరపల్లి పంచాయతీ పరిధి బుడగ జంగాలకాలనీ వద్ద గురువాంం జరిగింది. కాటారం సీఐ నాగార్జునరావు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనమాల సత్యమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. కుమారుడు కార్తీక్, అతడి భార్య ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు.

మంచిర్యాలలో ఉంటున్న కూతురు మౌనిక గర్భంతో ఉండగా ప్రసవానికి సమయం దగ్గర పడటంతో ఆమెను చూసుకోవడానికి సత్యమ్మ అక్కడికి వెళ్లింది. గురువారం పొరిగింటి వారు సత్యమ్మ ఇంటి తలుపులు కొంత తీసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని సత్యమ్మ కుమారుడు కార్తీక్‌కు ఫోన్‌లో చెప్పగా హుటాహుటిన అతడు ఇంటికి చేరుకున్నాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. సుమారు 18 తు లాలకు పైగా బంగారు, 5 తులాలకు పైగా వెండి ఆభ రణాలు, ఎల్ఈడీ టీవీ చోరీకి గురయ్యాయి. సంఘటన స్థలాన్ని సీఐ నాగార్జునరావు, క్లూస్ టీం ఇన్‌చార్జి సీఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చోరీ స్థలంలో క్లూస్ సేకరిస్తున్న సీఐలు నాగార్జునరావు, రాజ్‌కుమార్

ఫుడ్ విత్ చిల్డ్రన్

విన్నూత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులతో అధికారులు కలిసి భోజనం చేసేలా 'ఫుడ్ విత్ చిల్డ్రన్' పేరుతో అమల్లోకి తెచ్చారు. శుక్రవారం నుంచి జిల్లాలో ఇది కొనసాగనుంది. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యతను పరిశీలించడంతో పాటు మెనూను పాటిస్తున్నారా.. లేదా ? అనే అంశాలను పరిశీలించేందుకు కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లాలోని 62 వసతి గృహాలు, 432 ప్రభుత్వ పాఠశా లల్లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీ ల్దార్లు, జిల్లా, మండల అధికారులు ఇందులో పాల్గొంటారు. ఆయా హాస్టల్స్, పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. తద్వారా భోజనం నాణ్యతను పరిశీలిస్తారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

జనగామ కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో జనగామ జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

కళాశాలకు చెం దిన ఎ.వీరారెడ్డి కాంస్య పతకం సాధించగా, మహ్మద్ యూనిస్ రజిత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులు మైనారిటీ సంక్షేమాధికారి బి.రవీందర్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.అనిల్‌బాబు, కోఆర్డినేటర్ ఐ.వీరస్వామి, పీడీ బి.రాజు, వార్డెన్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్ తదితరులు

మహిళలను వేధిస్తే కఠిన శిక్షలు

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన జడ్జి రవీంద్రశర్మ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశాల్లో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు.

మహబూబాబాద్ జిల్లా కోర్టులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు వారు పనిచేసే ప్రదేశాల్లో ఏమైన లైంగిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే వారు న్యాయమూర్తుల కమిటీ సభ్యులుగా ఉన్న కమిటీకి విన్నవించుకోవాలన్నారు. దీంతో నేరం రుజువు అయితే వారిపై కఠిన చర్య లు ఉంటాయని చెప్పారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జిల్లా కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్, సూపరింటెండెంట్ అమరేందర్, కోర్టు ఉద్యోగులు తదితరుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రవీంద్రశర్మ

కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్!

(5వ పేజీ తరువాయి)

జూలై 5వ తేదీన రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వే జీఎంకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని లేఖ రాసింది. అదే ఏడాది జూలై 8వ తేదీన 160 ఎకరాల్లో రూ.521కోట్లతో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాజీపేటలో భూమి పూజ నిర్వహించారు. 2025లోగా పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. వ్యాగన్ పరిశ్రమపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన రైల్వే బోర్డు వ్యాగన్ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తు ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసేలా యూనిట్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ ఆదేశాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గురువారం కేంద్ర హోంశాఖ అధికారులు దేశంలోని సీఎస్‌లు, డీజీపీ లతో సమీక్ష జరుపుతున్న క్రమంలో తెలంగాణ అధికారులతో విభజన హామీలపై జరిగిన సమీక్షలో కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన వచ్చినట్టు సమాచారం. దీంతో సెప్టెంబరు 9వ తేదీనే కాజీపేటలో వ్యాగన్ తయారీ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినట్టుగా కేంద్ర హోంశాఖ అధికారులు చెప్పటంతో పాటు అందుకు సంబంధించిన జీవో కాపీని కూడా అందించడంతో కోచ్ ఫ్యాక్టరీ విషయం అధికారికంగా వెలుగులోకి వచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఏపీ విభజన చట్టం హామీల్లో గిరిజన యూనివర్సిటీకి ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. ఇక 13వ షెడ్యూల్, ఐటమ్ 10గా పేర్కొన్న కోచ్‌ఫ్యాక్టరీ హామీ కూడా అమలు కావటంతో ఓరుగల్లు ప్రజలు సంతోషం చేస్తున్నారు.

1969నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం

తెలంగాణలోనే అతిపెద్ద రెండో రైల్వేజంక్షన్‌గా ఉన్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ 55ఏళ్లుగా ఉంది. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కతా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలన్నా కాజీపేట రైల్వేస్టేషన్ మీదుగానే వెళ్లాలి. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు టీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికి కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. నాడు హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీనర్సింహారావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణంలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్‌లో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో.. ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఇక 2004లో యూపీఏ ప్రభుత్వంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కానీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54 ఎకరాల భూమిని కూడా కేటాయించినా, ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చిన అమలుకు నోచుకోలేదు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందు కోసం గత ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. అయితే కేంద్ర ప్రభుత్వం 2017లో దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ఆశలు వదులుకున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఇది సింగిల్ ఇంజన్ ప్రభుత్వ ఘనతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సీఎం రేవంత్‌రెడ్డి వల్లే సాధ్యమైందని, సింగిల్ ఇంజన్ ప్రభుత్వ ఘనతేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి సీఎం రేవంత్ కేంద్ర మంత్రులను కలిసి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలని ఒత్తిడి తీసుకొచ్చారని ఎంపీ తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని తీసుకవచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. డబుల్ ఇంజన్లుగా పని చేసిన బీఆర్ఎస్, బీజేపీలు చేయలేని పనులను సింగిల్ ఇంజన్‌తో రేవంత్‌రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.

నేతకానీలను ఎస్సీ-ఏలో చేర్చాలి

ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నికృష్ణ, మల్లయ్య

తాడ్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను వర్గీకరిస్తే నేతకాని కులస్థులను కేటగిరీ-ఏలో చేర్చాలని నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావేరి చిన్నికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండలంలోని బీరెల్లి, రంగాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో గురువారం జరిగిన గ్రామసభల్లో వారు మాట్లాడారు. తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో నేతకాని కులస్థులు అధికంగా ఉన్నారని, వారు విద్య, ఉపాధి, ఉద్యోగ, వైద్య రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడుచేసుకున్న భూములకు పట్టాలు రాక, బ్యాంకుల నుంచి రుణాలు అందక, సబ్సిడీ రుణాలందక నేతకానిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేస్తే నేతకాని కులాన్ని కేటగిరీ-ఏలో చేర్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోడుభూములకు హక్కు పత్రాలు అందించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్యరంగాల్లో అభివృద్ధి చేయాలని, ఐదుశాతం రిజర్వేషన్ కల్పించి సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామ సభల్లో జిల్లా అధ్యక్షుడు దీకొండ కాంతారావు, ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోశయ్య, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి సునారికాని శ్యామ్, నాయకులు బాడిష వెంకన్న, గాంధర్ల కాంతారావు, సునారికాని వెంకటయ్య, రాంబాబు, జనగాం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌తో.. ప్రజాక్షేత్రంలోకి..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దీక్షా దివస్‌కు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

స్థానిక సంస్థలపై గురి..

ఏడాది కాలంగా ఎన్నిక ఏదైనా గులాబీ పార్టీకి ఓటమే మిగులుతుంది. దీంతో క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రతిపక్ష పార్టీగా పోరాటమే శరణ్యంగా దీక్షాదివస్‌తో ప్రజాక్షేత్రంలోకి వెళుతోంది. డిసెంబరు 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న గులాబీ నేతలు.. వచ్చే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని ఆరాట పడుతున్నారు. స్థానికంలో ఉనికి చాటుకోకుంటే.. భవిష్యత్తులో మరింత గడ్డు కాలం తప్పదన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

దీంతో గ్రామాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే నేతలకు స్థానిక సంస్థల్లో పోటీకి మద్దతు ఇస్తామని హామీ ఇస్తున్నారు. గత పదేళ్లలో జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు బీఆర్ఎస్ వారే ఉన్నారు. ఈసారి కూడా ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో గెలవటంతో పాటు కనీసం మూడు జడ్పీలను ఖాతాలో వేసుకోవాలని ఆ పార్టీ నేతలు కృషి చేస్తున్నారు.

ఆనాటి దీక్షలో పోరెత్తిన ఓరుగల్లు

తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లు పోరెత్తింది. టీజేఏసీ, బీఆర్ఎస్ ఇచ్చిన ప్రతీ పోరాటంలో వరంగల్ ప్రజలు పాల్గొన్నారు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష వరంగల్‌లో ఉద్రిక్తతలకు దారి తీసింది. 15ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటన ఇంకా ఉద్యమకారుల జ్ఞాపకాలను దాటి పోలేదు. 2009 నవంబరు 29వ తేదీన కేసీఆర్ కరీంనగర్ నుంచి సిద్ధిపేటకు బయలుదేరారు. ఆయన వెంట తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, కన్నబోయిన రాజయ్యయాదవ్ ఉన్నారు. కరీంనగర్ జిల్లా అల్గనూరు వద్ద కేసీఆర్‌తో పాటు రాజయ్యయాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

దీంతో వరంగల్ నగరం ఉద్రిక్తంగా మారింది. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, బీఆర్ఎస్ శ్రేణులు, టీజేఏసీ నేతలు నిరసనలు ఆందోళనకు దిగారు. కేయూ గేటు మూసి విద్యార్థులు బయటకు రాకుండా అప్పట్లో పోలీసులు అడ్డుకున్నారు. నిరసన తెలియజేసేందుకు వచ్చిన అప్పటి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కేయూ సమీపంలో ధర్నాకు దిగారు. వీరిని పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేయటంతో కేయూ విద్యార్థులు భగ్గుమన్నారు. వరంగల్‌లో ఉద్రిక్తతగా మార టంతో పోలీసులు కేసీఆర్‌ను వరంగల్ సెంట్రల్ జైలుకు కాకుండా వ్యూహాత్మకంగా ఖమ్మం జైలుకు తరలించారు. నాటి నుంచే ఓరుగల్లులో తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరింది.

కుట్రలను భగ్నం చేసిన కేసీఆర్ దీక్ష

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సంపేట



రాజకీయంగా తెలంగాణను సాధించాలని కేసీఆర్ చేసిన ప్రయత్నాలను కాంగ్రెస్, టీడీపీలు విఫలం చేశాయి. 2004లో కాంగ్రెస్‌తో, 2009లో టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నా వారి అవసరాల కోసం ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేశారు. దీంతోనే వరంగల్ జిల్లా గురిజాల గ్రామానికి పల్లెనిద్రకు వచ్చిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు ప్రణాళిక రూపొందించారు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ఆయన చేసిన ఆమరణ దీక్ష యావత్ తెలంగాణ లోకాన్ని ఉద్యమం వైపు నడిపించింది. నాటి కేసీఆర్ దీక్షతోనే స్వరాష్ట్ర కల సాకారమైంది.

కేసీఆర్ లేకుంటే రాష్ట్రం వచ్చేదే కాదు..

గండ్ర వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్



కేసీఆర్ ఉద్యమాన్ని ప్రారంభించకుంటే తెలంగాణ వచ్చేదే కాదు. 2009 నవంబరు 29న కేసీఆర్ చేసిన ఆమరణ దీక్షతోనే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తించింది. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితోనే వరంగల్‌లో ఉద్యమం ఉప్పెనై లేచింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చీఫ్ విప్‌గా ఉండి తెలంగాణ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చాం. అమర వీరుల ప్రాణ త్యాగాలు, కేసీఆర్ ఉద్యమ ఫలితంగా తెలంగాణ ఏర్పడింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2460	2080
పల్లికాయ (సూక)	5910	4000
పల్లికాయ (పచ్చిది)	5200	3000
కందులు	-	-
పెసళ్లు	-	-
పత్తి	6840	5800
కొత్తపత్తి	-	-
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	14500	11000
యూఎస్341ఏసీ	13000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED HINDI TEACHER
★ High School Hindi Teacher Wanted New Vision School Near Girnibavi(Vill), Laknepally (Mdl), Narsampet. Cell : 9550633624, 9849464761.
AJW-199422

PLOT FOR SALE
★ మహబూబాబాద్ పట్టణంలోని రామచంద్రాపురం కాలనీలో గల 350 గజాల, పడమర ఫేస్, 31 అడుగుల వెడల్పు, 99 అడుగుల పొడవు. J. సుభాకర్ సంప్రదించు. ఫోన్ నెం : 8333039682, 9866948782. నో బ్రోకర్స్
AJW-199423

WANTED
★ ప్రముఖ ఆఫీస్‌లలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ మరియు టెలికాలర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 8,000/- , 12,000/-. సంప్రదించండి: 8686688863.
AJW-199477

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ WGL, HNK నందు గల Show Rooms,Hospitals మరియు అపార్ట్‌మెంట్స్ నందు సెక్యూరిటీగార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 10,000/- నుండి 15,000/- + ESI, EPF. సంప్రదించండి : 8978459111, 6309922608
AJW-457

WANTED
★ డిస్నీల్యాండ్ రెసిడెన్షియల్ పాఠశాలలో పని చేయుటకు జనరల్ వర్కర్స్ మరియు అసిస్టెంట్ వంటమనుషులు కావలెను. భోజనం మరియు వసతి కల్పించడం జరుగుతుంది. జీతం : 7000 నుండి 12,000 ఇవ్వబడును. సంప్రదించండి: 9849785506, 9440663359
AJW-228455

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండలోని మా సంస్థ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ కావలెను. 8గం।।, 12గం।।, డ్యూటీలు కలవు. జీతం:12,000-16,000. సంప్రదించండి: 9000463426
AJW-199473

WANTED PHARMACISTS
★ హన్మకొండ కిషన్‌పురలో గల మెడికల్ షాపులో ఫార్మాసిస్ట్‌లుగా చేయుటకు అనుభవం గలవారు మరియు ఫ్రెషర్స్ కావలెను. సంప్రదించండి : 9000505091. Wanted Lady Receptionist : 9393113929
AJW-7626

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. సంప్రదించండి: 9849145043, 9866584455
AJW-199469

శ్రీకర హాస్పిటల్
★ భుజం, తొంటి, మోకాళ్ళ స్పెషలిస్ట్ శ్రీకర హాస్పిటల్ (HYD) Dr. అభిషేక్ బల్లి గారు డిసెంబర్ 1వ తేదీన వరంగల్‌లో అందుబాటులో ఉంటారు. సంప్రదించండి: 9494569591
AJW-226275

CHANGE OF NAME
★ I, BHUTHAPATI JULIET (Old Name) R/o. H.No : 1-3-58, BLM Baptist Church, Rehmanth Nagar, Kazipet, Hanumakonda. Dist -506003, T.S. India, Have Changed My Name as BUTHAPATI ALBERT JULIET (New Name) W/o.BHUTHAPATI VINAY KUMAR. for all future purposes.
AJW-MOIN

CHANGE OF NAME
★ I, POOSAPATI KAVITHA W/o. POOSAPATI ASHOK (Old Name) H.No : 1-3-52/5, Shivalayam Street, Mahabubabad. Dist Mahabubabad TG. Pin 506101. I Have Changed My Name as GOKINAPALLY KAVITHA. W/o. POOSAPATI ASHOK(New Name) for all future Purposes.
AJW-199424

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

3+2 స్కీం కలదు



నర్సంపేటలోని బాలుర హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న వంట షెడ్డు

అమలు సరే.. నాణ్యతేదీ ?

- ప్రమాణాలకు అనుగుణం లేని మధ్యాహ్న భోజనం
- దొడ్డు అన్నం తినేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు

వరంగల్ సిటీ, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నా.. నాణ్యత విషయంలో మాత్రం పట్టింపులేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంట ఏజెన్సీలకు మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో వారు తక్కువ ధరలకు వచ్చే కూరగాయలు, సరుకులతో వంట వండుతున్నారనన్న విమర్శలున్నాయి. వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లాలో 540 ప్రభుత్వ పాఠశాలలుండగా 32,843 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని పొందుతున్నారు. వారికి మెనూ ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీనీ వండిన తర్వాత దొడ్డు అన్నంగా అవుతుండటం, మెత్తగా, ముద్దలుగా అవుతుండటం, కూరలు చారులా పలుచగా తయారు చేయడంతో విద్యార్థులు తినేందుకు ఆసక్తి చూపించడం లేదు. కొన్ని పాఠశాలలో తాగు నీటి సౌకర్యం సరిగ్గా లేక విద్యార్థులు ఇంటి నుంచే నీళ్ల తెచ్చుకుంటున్నారు. పప్పులు, ఉప్పులు, నూనెల పంపిణీలో నాణ్యాతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కూరగాయల ధరలు పెరిగి పోవడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని, మూడు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసే వాళ్లు నెలా నెలా మారుతుండడంతో రుచి, శుచి, నాణ్యాతా ప్రమాణాలు పడిపోతున్నాయి. కొన్ని పాఠశాలల్లో వంటశాలలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ప్రజా ప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యాతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఏజెన్సీలకు వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలల్లో 1378 మంది విద్యార్థులు చదువుతుండగా.. 50వంట ఏజెన్సీలు వారికి వండిపెడుతున్నాయి. వీరికి చెల్లించే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని చోట్ల మెనూకు విరుద్ధంగా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో కిచెన్ షెడ్డు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ కిందనే వంటలు చేస్తున్నారు. కెచెన్ షెడ్డు నిర్మాణం తలపెట్టినా అది మధ్యలోనే నిలిచిపోయింది. ఖానాపూర్ మండలంలో 35 పాఠశాలల్లో 1875 మంది చిన్నారులకు వంట చేసేందుకు 35 వంట ఏజెన్సీలు పని చేస్తున్నాయి. సన్నబియ్యం పంపిణీ చేసినా వండితే దొడ్డు అన్నమవుతోంది. పర్వతగిరి మండలంలో 35 పాఠశాలలో 2150 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటున్నారు. వర్ధన్నపేట మండలంలో చాల వరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత కరువైంది. ఇలా జిల్లాలోని మిగిలిన పాఠశాల్లో ఉప్పులు, పప్పులు, నూనెలు, కూరగాయలు పంపిణీ చేసే నిర్వాహకులు నాణ్యతను పాటించడం లేదని తెలుస్తోంది. కూరలు సాంబారులా పలుచగా ఉంటున్నాయని, మహిళా సంఘాలవారు నెలనెలా మారుతుండడంతో వంటల్లో నాణ్యత కరువవుతోందని తెలుస్తోంది.

ముక్కిన బియ్యం..
ముద్దలవుతున్న అన్నం

- కానరాని వంట గదులు, ఆరు బయటే పొయ్యిలు
- బిల్లుల పెండింగ్‌తో బడి బువ్వలో అమలు కాని మెనూ



నర్మెట్ట ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రమైన స్థలంలో నిల్వ చేసిన కూరగాయలు

జనగామ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కడుపు నింపే మధ్యాహ్న భోజనంపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, వండే ప్రదేశాలు, సరుకుల నాణ్యతపై పర్యవేక్షణ చేసే వారు లేక నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలోని 12మండలాల్లోని కొన్ని స్కూళ్లలో మాత్రమే మధ్యాహ్న భోజన నిర్వహణ తీరు సక్రమంగా ఉందని తెలుస్తోంది. ముక్కిన, తుట్టెలు కట్టిన బియ్యం.. అది కూడా దొడ్డు బియ్యంతో అన్నం వండుతుండటంతో మెత్తగా.. ముద్దలుగా ఉంటుండటంతో విద్యార్థులు తినలేకపోతున్నారు.

దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో ముక్కిన, తుట్టెలు కట్టిన, పురుగులు పట్టిన బియ్యంతోనే వంట చేస్తున్నారు. దీంతో పిల్లలు తృప్తిగా భోజనం చేయలేకపోయారు. అయితే సరఫరా అయినప్పుడే బియ్యం ఇలా ఉంటున్నాయని, తాము పురుగులు లేకుండా శుభ్రం చేసిన తర్వాతే వంట చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇక పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పాఠశాలల్లో ఏదో ఒక మూలన వంట చేస్తున్నారు. స్కూళ్లలో శాశ్వత వంట గదుల నిర్మాణం చేయాలన్న డిమాండ్ ఉంది. జఫర్‌ఘడ్ మోడల్ స్కూల్‌లో వంట గది లేకపోవడంతో ఓ గుడిసె వేసుకొని దాని కింద వంట చేస్తున్నారు. కూరగాయలను ఎక్కడపడితే అక్కడ కింద పోసి ఉంచుతున్నారు. కొన్ని చోట్ల కూరగాయలు కోసిన తర్వాత గాలికి వదిలేయడంతో ఈగలు ముసురుతున్నాయి.

వాటిపై దుమ్ముధూళి పడుతోంది. చాలా వరకు స్కూళ్లలో గ్యాస్ సదుపాయం లేకపోవడంతో కట్టెల పొయ్యి మీదనే నిర్వాహకులు వంట చేస్తున్నారు. ఇక స్కూళ్లలో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడం లేదు. మెనూ ప్రకారం గురువారం వెజ్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ పెట్టాల్సి ఉంది. కానీ.. చాలా స్కూళ్లలో ఆ మెనూ కనిపించలేదు.

మార్కెట్ ధరలకు అను గుణంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకపోవడం వల్ల గిట్టుబాటు కాక వారు తమకు ఇష్టమొచ్చినవి వండి పెడుతున్నారని తెలుస్తోంది. అప్పులు తెచ్చి భోజనం పెడుతున్నామని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.6.50 పైగా ఉండగా ప్రభుత్వం రూ.5 చొప్పున ఇస్తోంది. దీనికి నెలల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో పరిమాణం లేని గుడ్లు అందిస్తున్నారని తెలుస్తోంది.

ఏజెన్సీల ఇష్టారాజ్యం

- మెనూ, నాణ్యత పాటించడంలో నిర్లక్ష్యం
- తినలేక ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు



గూడూరు బాలికల పాఠశాలలో ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి విజిట్ Visit

మహబూబాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ కరువైంది. కొన్ని పాఠశాలల్లో వంట నిర్వాహకుల ఇష్టారీతిన వండి పెడుతుండటంతో తినలేక విద్యార్థులు ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల కుళ్లిన కూరగాయలు కనిపించాయి. ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తున్నా నాణ్యమైన కూరగాయలు, సరుకులు కొనుగోలు చేయకపోవడంతో వంటల్లో నాణ్యత లోపిస్తోంది. మెనూ పాటించకపోవ డంతో పౌష్టికాహారం అందడం లేదు. కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్‌లో పురుగులు పట్టిన కిరాణ సామాను, కుళ్లి పోయిన కూరగాయలు దర్శనమిచ్చాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తంగా 863 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో 45,135 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 627 ఉండగా, వాటిల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో 20,449 మంది చదువుతు న్నారు. 119 ప్రాథమికోన్నత పాఠశాలలుండగా వాటిల్లో 7,570 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం చదువుతున్నారు. 109 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా.. 13,665 మంది, ఎనిమిది మోడల్ స్కూళ్లు ఉండగా, వాటిల్లో 3,450 మంది చదువుతున్నారు. అయితే మధ్యాహ్నభోజన వంట నిర్వాహకులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అప్పులు చేసి, వంటలు చేయాల్సిన పరిస్థితి రావడంతో నాణ్యతలేని తక్కువ ధరలకు వచ్చే కూరగాయలను కొనుగోలు చేసి తమకు ఇష్టమొచ్చినవి పెడుతున్నారని తెలుస్తోంది. సోమవారం కిచిడి (పచ్చియ్యం)తో మిక్స్‌డ్ విజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు మంగళవారం అన్నం, సాంబారు, కూర, బుధవారం అన్నం, పప్పులో ఆకుకూర, కోడిగుడ్డు, గురువారం విజిటెబుల్ బిర్యానీ, ఏదేని ఒకకూర, శుక్రవారం అన్నం, సాంబారు, కోడిగుడ్డు, కూర, శనివారం అన్నం, పప్పులో ఆకుకూర, కూర పెట్టాల్సి ఉంటుందని, ఈ రకంగా మెనూ ప్రకారం వంట చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



వేలేరు బాలుర గురుకుల పాఠశాలలో సిబ్బంది లేక మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

రుచీ పచీ లేని వంటలు.. విద్యార్థుల తంటాలు

- విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం
- మిడ్‌డే మీల్స్‌లో మెనూ పాటించని నిర్వాహకులు

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేదు. నాసిరకం పదార్థాలతో వండుతుండటంతో రుచీ పచీ లేక విద్యార్థులు తినలేకపోతున్నారు. పలు చోట్ల సన్నబియ్యం స్థానంలో దొడ్డు బియ్యంతో ఉడికీ ఉడకని అన్నం, కుళ్లిన, పుచ్చులున్న కూరగాయలతో వండిన కూరలు పెడుతుండటంతో చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలోని మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే పరిస్థితి. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించినా, భోజనంలో ఏమి ఉండాలో మెనూ ఇచ్చినా పాటించడం లేదు. భోజనం వండడానికి చాలా పాఠశాలల్లో వంటషెడ్లు లేవు. తాగునీటి సరఫరా లేదు. బియ్యం, కూరగాయలు, వంట సరుకులను నిల్వ చేసేందుకు స్టోర్ రూంలు లేవు. కొన్ని చోట్ల పురుగులు పట్టిన బియ్యం ఉంటున్నాయి.

పలు మండలాల్లో ఇలా..

వేలేరు మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనం దొడ్డు బియ్యంతో వండుతున్నారు. బియ్యంలో రాళ్లు, పురుగులుంటున్నాయని విద్యార్థులు వాపోయారు. సరిపడా మధ్యాహ్నం భోజనం సిబ్బంది లేక పోవడంతో విద్యార్థులే భోజనాన్ని వడ్డించుకోవడం కనిపించింది. నడికూడ మండలంలోని పలు స్కూళ్లలో కొత్త బియ్యంతో అన్నం వండుతుండడంతో మెత్తగా ఉండి విద్యార్థులు తినలే కపోవడం కనిపించింది. ఇదేంటని అడిగితే పౌరసరఫరా అధికా రులు పంపిన బియ్య మే వండుతున్నామని నిర్వాహకులు సమాధా నమిచ్చారు. వంటశాల లేకపోవడంతో ఆరుబయటే వండుతున్నారు. గాలి వచ్చినప్పుడు దుమ్ము, దూళి ఎగిసి వంటల్లో పడుతోంది. భీమ దేవరపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ సరిగా పాటిం చడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

గురువారం రుచీపచీ లేని వెజిటబుల్ రైస్ వడ్డించగా.. అందులో ఒక్క రకం కూరగాయ మాత్రమే వాడారు. ఎల్కతుర్తి మండలంలోని పాఠశాలల్లో వంట ఏజెన్సీ వారికి బిల్లులు సకాలంలో రావడం లేదన్న కారణంతో మధ్యాహ్నం వంట విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలిసింది. పరకాల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వేతనాలు సరిగా రావడం లేదని పని మానేసారు. దీనితో ఆ మధ్యాహ్నం భోజనం వండేవారు లేక నాలుగైదు రోజులుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులతో వండిస్తూ మమ అనిపిస్తున్నారు. ఇక్కడ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ఐనవోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు లేక విద్యార్థులు నేల మీదే కూర్చొని తింటున్నారు. ఆరు బయట భోజనం వడ్డిస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలో మధ్యాహ్న భోజనం బాగానే ఉంటోందని, ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్టు చెబుతున్నా చాలా చోట్ల దొడ్డు బియ్యమే కనిపించాయి.

బియ్యం నిలువ చేసేందుకు స్టోర్ రూంలు లేకపోడంతో ఎండకు ఎండి, వానకు తడిసి పురుగులు పడు తున్నాయి. ఆత్మకూరు మండలంలోని ఎంజేపీ పెద్దాపూర్ బాలికల పాఠశాలను గురువారం నోడల్ ఆఫీసర్ ఎంపీ డీవో సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని తనఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యంగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.



గుర్రేవుల పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉన్న చేతి పంపు వద్ద ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు

పచ్చి పులుసుతో
సరిపెడుతున్నారు..

- ములుగు జిల్లాలోనూ మెనూ విషయంలో నిర్లక్ష్యం
- సౌకర్యాల్లేక వంట తయారీలో ఇబ్బందులు

ములుగు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): సర్కా రు బడికి వెళ్తున్న నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు ఒక పూట పౌష్టికాహారం అందించి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకం ములుగు జిల్లాలో గాడి తప్పుతోంది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో మెనూ అమలు కావడంలేదు. మౌలిక సౌకర్యాలు లేక పోవడంతో భోజనంలో నాణ్యత కొరవడుతోంది. మెనూను అనుసరిస్తూ కూరగాయలు, పప్పుతో భోజనం పెట్టాల్సి ఉండగా ప్రభుత్వం సక్రమంగా బిల్లులు ఇవ్వకపోవడంతో నష్టాన్ని పూడ్చుకునేందుకు కొన్ని భోజన ఏజెన్సీలు రెగ్యులర్ మెనూలో పచ్చి పులుసుతో సరిపెడుతున్నారు. దీంతో రోజూ ఆ నీళ్ల చారు తినలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి తమకు కడుపునొప్పి వస్తోందని పలువురు చిన్నారులు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 353పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు- మనబడి కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు వంట గదులను మంజూరు చేసినప్పటికీ 195 పాఠశాలల్లో మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. వీటి లో కొన్ని ఇరుకుగా ఉండటంతో దాదాపు 70శాతం పాఠశాలల్లో ఆరుబయటే వంటలు వండుతున్నారు. ఏమరుపాటుగా ఉన్నా వండే భోజనంలో ఏం పడుతుందో తెలియని పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్న క్రమంలో ములుగు జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

మంగపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో వంట గది ఇరుకుగా ఉండటంతో ఆరుబయట కట్టెల పొయ్యిపైనే వంటల చేస్తున్నారు. కోడిగుడ్ల బిల్లులు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో నవంబరు మొదటి నుంచి విద్యార్థులుకు ఉడకపెట్టిన గుడ్డును వడ్డించడం లేదు. కన్నాయిగూడెం మండలం గుర్రేవులలో ఒకే ప్రాంగణంలో ఉన్న జడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో తాగునీటి వసతి లేదు. నల్లాలు ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు. చేతిపంపు ఉన్నా ఆ నీరు ఉప్పగా ఉన్నాయి. ఒక్కోరోజు ఆఖరున ఉన్న వారికి భోజనం అందడంలేదని విద్యార్థులు చెబుతున్నారు. డైనింగ్‌హాల్ అపరిశుభ్రంగా ఉంది. చిన్నబోయినపల్లి ఆర్‌వో ప్లాంటు పనిచేయడం లేదు. 400 మంది విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్ క్యాన్లు తెప్పిస్తున్నారు. వెంకటాపూర్ మోడల్ స్కూల్‌లో రోజూ నీళ్ల చారు పెడుతున్నారని విద్యార్థులు చెప్పారు. ఇక్కడ ఆర్‌వో ప్లాంటు పనిచేయడం లేదు. వాజేడు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో రెండు రోజులకోసారి మాడిపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు చెప్పారు.

మధ్యాహ్న భోజనంపై పాఠశాల స్థాయి కమిటీలు

- కలుషిత ఆహార సంఘటనలపై విచారణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కలుషితమైన మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గరవుతున్న సంఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టింది. మధ్యాహ్న భోజనం కలుషితంపై హైకోర్టు సైతం మొట్టి కాయలు వేయడంతో అప్రమత్తమైన ప్రభుత్వం.. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లకు పూనుకున్నది. ఇందులో భాగంగా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, ఏడబ్ల్యూసీలలో ఆహార భద్రతా కమిటీలను, అలాగే కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలపై విచారణకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీని వేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆహార భద్రతా కమిటీలు

ఆహార భద్రతా కమిటీలో హెచ్‌ఎంలు లేదా ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పాఠశాలలోని వంట, స్టోర్ రూమ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా, నాణ్యతగా, నిర్దేశిత పౌష్టిక ప్రమాణాలతో మెనూ ప్రకారం తయారు చేసేలా చూస్తుంది. విద్యార్థులకు వడ్డించే ముందు రుచిచూస్తారు. ప్రతీ రోజు కమిటీలోని సభ్యులు వంట గదిని, స్టోర్ రూమ్ తనిఖీ చేసిన, ఆహారాన్ని రుచి చూసిన ఫొటోలను తీసి ఇందు కోసం ప్రత్యేకంగా రూపొందించే యాప్‌లో భోజనం వడ్డించే ముందు అప్‌లోడ్ చేస్తారు, మండల, డివిజినల్, జిల్లా స్థాయి అధికారులు ఈ పాఠశాల స్థాయి ఆహార భద్రతా కమిటీల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా కలెక్టర్ చూస్తారు. ఈ అధికారులు సాధ్యమైనంత మేరకు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించే ముందు పాఠశాలలకు వెళ్లి భోజనాన్ని తనిఖీ చేస్తారు. వారు కూడా ఫొటోలు తీసి కలెక్టర్‌కు పంపుతారు.

టాస్క్‌ఫోర్సు కమిటీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, విద్య, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నడిచే వివిధ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులు, బాలింతలు, శిశువులకు అందజేసే ఆహారం నాణ్యంగా ఉందా లేదా పరిశీలించడానికి, ఈ సంస్థలు సరిగా పని చేస్తున్నాయా లేవా తనిఖీ చేయడానికి టాస్క్‌ఫోర్సు కమిటీని వేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్సు కమిటీలో ఆహార భద్రతా కమిషనర్ లేదా ఆహార భద్ర తా అధికారి, సంబంధిత సంస్థ హెచవోడీలు, లేదా అదనపు డైరెక్టర్లు, జిల్లా స్థాయిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఆహారం కలుషితమైనప్పుడు టాస్క్‌ఫోర్సు కమిటీ అందుకు గల కారణాలు, బాధ్యులను గుర్తించి ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీకి సమర్పిస్తుంది. నివేదికను పరిశీలించిన అనంతరం ఆ మేరకు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకుంటుంది.

నీళ్ల పప్పు.. నాణ్యత లేని కూరలు

- ముక్కుబడిగా మధ్యాహ్న భోజనం



భూపాలపల్లిలోని యూపీఎస్‌లో వరండాలో భోజనం వండుతున్న సిబ్బంది

భూపాలపల్లి టౌన్, నవంబరు 28 ((ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం అమలు అధ్వానంగా ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని విద్యాలయాల్లో ఇది గాడి తప్పింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. జిల్లాలో మొత్తం 457 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 16,659 మంది విద్యార్థులకు ఒక పూట భోజనం పెడుతున్నారు. అయితే ఇక్కడ మెనూను గాలికి వదిలేశారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా రోజువారీగా ఇచ్చే ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండటం లేదని, అరకొర పరిమాణంతో వడిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కూరల సాంద్రతను తగ్గుతోందని విద్యార్థులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మెజారిటీ పాఠశాలలకు వంట శాలలు లేవు. ఉన్నచోట కూడా తరగతి గదులను సామగ్రి నిల్వ కేంద్రాలుగా, వరండాలను భోజన శాలలుగా మార్చారు. చాలాచోట్లా ఆ పరిస్థితి కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే చెట్ల కింద వంటలు వండి వడ్డిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాలల భోజన సమయాల్లో ఆహార పదార్థాలపై రక్షణ ఏర్పాట్లు లేక చెత్తాచెదారం కూడా పడుతున్న దుస్థితి ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా వంటశాలల్లో అపరిశుభ్రత వాతావరణం కూడా అధికంగా ఉందని చెబుతున్నారు.

ఈ పరిస్థితుల్లో ఆహారం విషతుల్యంగా మారే ప్రమాదం ఉందని తెలుస్తోంది. రేగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పప్పుకూర, సాంబారు వండి వడ్డించారు. ఎక్కువ సార్లు పప్పు, సాంబారు మాత్రమే పెడుతున్నారని, అదికూడా నీళ్లలా చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఒకసారి వండిన ఆలుగడ్డ కూరలు మళ్లీ మళ్లీ పెడుతున్నారని చెప్పారు. గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండడం వల్ల సంబంధిత కాంట్రాక్టర్ మధ్యాహ్న భోజనాన్ని ఇంటివద్దే వండుకుని తీసుకొస్తున్నారని, వంటలో నాణ్యతా ప్రమాణాలు ఉండడం లేదని విద్యార్థులు అంటున్నారు.

కాటారం మండలంలోని దేవరాంపల్లి ఉన్నత పాఠశాలలో పప్పు చారు నీళ్లలా వండుతున్నారని, కూరగాయలు సరిగా వండటం లేదని తెలిపారు. అలాగే ఏ పాఠశాలల్లో పరిశీలించినా భోజన శాలలు లేక ఆరుబయట, వరండాల్లో తింటూ విద్యార్థులు కనిపించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన 14 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు

నర్సంపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలోని శివాని పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన వరంగల్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా, వైజ్ఞాన ప్రదర్శన గురువారంతో ముగిసింది. ప్రదర్శనలో పాల్గొన్న 148 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల్లో 14 ప్రాజెక్టులు, 352 రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనల నుంచి సీనియర్ విభాగంలో ఏడు, జూనియర్ విభాగంలో ఏడు ఎగ్జిబిట్స్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ తెలిపారు. ఇన్‌స్పైర్, ఆర్‌బీవీపీ ఎగ్జిబిట్లను వరంగల్ జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు వివిధ అంశాల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 185 పాఠశాలల నుంచి 6వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

ఎంపికైన ఇన్‌స్పైర్ ప్రాజెక్టులివే..

ఫోల్డబుల్ లాడర్ ఫర్ క్లైయింబింగ్ అప్పర్ బెర్త్ ఇన్ ట్రెయిన్ అనే అంశంపై తయారు చేసిన కేశవాపూర్ జడ్పీకి చెందిన విద్యార్థి పి.శివ కుమార్ ప్రాజెక్టు, టీఎస్ఎంఎస్, నెక్కొండ విద్యార్థులు ఆర్.సాయి హృతిక్, హర్షవర్ధన్‌ల ప్రాజెక్టు షై బ్రైడ్ డ్రోన్ కెమెరా ద సీక్రెట్ సోల్జర్, కేవీ స్కూల్, ఎస్ఆర్ఆర్ తోట వరంగల్‌కు చెందిన విద్యార్థి ఎస్.వినూత్న ప్రాజెక్టు లైట్ పైప్స, ఎంయూపీఎస్ రోల్లకల్ విద్యార్థి ఎం.శివాని ప్రాజెక్టు ప్యాకెట్ సైజ్ ఫోల్డబుల్ జాకెట్ ఫర్ ఫీడింగ్ మదర్స్ ప్రాజెక్టు, విద్యాభవన్ హైస్కూల్, సంగెం విద్యార్థి ఇ.సాయితేజ ప్రాజెక్టు పంటల నుంచి మట్టిని తొలగించే వ్యవసాయ యంత్రం, ఎస్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థి బి.రుత్విక ప్రాజెక్టు ఆటోమెటిక్ డైరెక్షనల్ సోలార్ ప్యానెల్స్, జడ్పీహెచ్ఎస్ సూరిపల్లి విద్యార్థి వి.సహస్ర ప్రాజెక్టు పోర్టబుల్ ప్యాడీ డ్రైయర్, టీజీహెచ్ఎస్ (బాలురు)విద్యార్థి జశ్వంత్‌నాయక్ ప్రాజెక్టు అగ్రి రోబోట్ ఆర్డినో, జడ్పీహెచ్ఎస్ బుధరావుపేట విద్యార్థి జె.శివ భారతి ప్రాజెక్టు ట్రాన్స్‌పోర్ట్ పెట్రోల్ డెలివరి గన్ విత్ ఆక్యురేట్ మెసర్‌మెంట్, సెయింట్ జాన్స్ హైస్కూల్, గీసుగొండ విద్యార్థి ఎ.తేజవర్ధన్ ప్రాజెక్టు మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్, ఆల్ఫోర్స్ హైస్కూల్, వర్ధన్నపేట విద్యార్థి వి.రిష్మిత ప్రాజెక్టు గార్బెల్ కలెక్షన్‌త్రో సైక్లింగ్, ఉర్సు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి మీర్జా అబ్రార్ అలీబేగ్ ప్రాజెక్టు ట్రిపుల్ రైడింగ్ ఈస్ ప్రొహిబిటెడ్, జడ్పీ మాధన్నపేట విద్యార్థి ఎస్.శ్రావణి ప్రాజెక్టు డివైస్ టు డ్రై మోర్ క్లాత్స్ ఇన్ షార్ట్ టైమ్, డఫోడిల్స్ హైస్కూల్, నర్సంపేట విద్యార్థి ఎస్.కె. సుఫియాన్ ప్రాజెక్టు హైడ్రాలిక్ ఫ్లడ్ ప్రొటెక్షన్ ఫర్ హోమ్స్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అలాగే, సీనియర్, జూనియర్ విభాగంలో ఆర్‌బీవీపీ ఎగ్జిబిట్స్‌లో రాష్ట్ర స్థాయికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ద హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పి. శ్రీమేథ, పి. అక్షర, ప్లాటినమ్ హైస్కూల్ విద్యాథ జి. అనిరుధ్, గీతాంజలి డీజీ స్కూల్ విద్యార్థి బి.అలోక్‌చంద్ర, జడ్పీహెచ్ఎస్ బుధరావుపేట విద్యార్థి హసన్, సిద్ధార్థ టీచర్స్ ఎగ్జిబిట్స్‌లో జీపీఎస్, కరీమాబాద్, ఖిలావరంగల్ టీచర్ పి. రేఖ ఎంపికయ్యారు.

ముగిసిన వరంగల్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఈవో, జిల్లా సైన్స్ అధికారులు

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ షురూ

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు డీఈవో దౌలాగర్ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండురోజుల పాటు ఈ కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కాగా, గురువారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు వారి ఎగ్జిబిట్లు ప్రదర్శించనున్నారు.

ప్రైవేట్ పాఠశాలలో నిర్వహణపై అభ్యంతరం

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన సైన్స్‌ఫెయిర్‌ను ఓ కార్పొరేట్ పాఠశాలలో నిర్వహించడంపై పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనలకు నిధులు కేటాయిస్తున్నా ప్రైవేటు పాఠశాలలకు పేరు వచ్చేలా ఆయా పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడాన్ని వారు తప్పుబడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే అధికారులు మాత్రం ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపుచూస్తూ ప్రైవేటు పాఠశాలలు కల్పిస్తున్న సౌకర్యాలకు అర్రులు చాస్తూ వాటికి గుర్తింపు తీసుకువచ్చేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అస్తవ్యస్తంగా ఆస్పత్రుల నిర్వహణ




తాళం వేసి ఉన్న జంగేడు పల్లె దావాఖాన, సిబ్బంది లేక వెలవెలబోతున్న మోరంచపల్లి దవాఖాన

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండల పరిధి ఎనిమిది పల్లె దవాఖానాలు ఉన్నాయి. భూపాలపల్లి-1, భూపాలపల్లి-2, ఖాశీంపల్లి, జంగేడు, మోరంచపల్లి, కొంపెల్లి, గొర్లవీడు, కమలాపూర్‌లో ఇవి కొనసాగుతున్నాయి. ఒక ఎంబీబీఎస్ వైద్యుడు, ఒక ఏఎన్ఎం లేదా ఆశా కార్యకర్త చొప్పున విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఐదు ఆస్పత్రుల్లో సరిపడా సంఖ్యలో వైద్యులు ఉన్నారు. భూపాలపల్లి-1, భూపాలపల్లి-2, కమలాపూర్ దవాఖనాల్లో వైద్యులు లేరు. దీంతో ఇతర వైద్యశాలల్లో పనిచేసే డాక్టర్లు ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వైద్యులు సకాలంలో విధులకు రాకపోవడం, అసలుకే అందుబాటులో ఉండకపోవడంతో రోగులు అవస్థపడుతున్నారు. ఈ పరిస్థితి మండలంలోని అన్ని పల్లె దవఖానాల్లో నెలకొంది. కొన్నిచోట్ల సిబ్బంది ఎవరూ ఉండటం లేదు. గురువారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లిలో దావాఖానలో వైద్యులు, సిబ్బంది ఎవరూ కనిపించలేదు. భూపాలపల్లి మండలం గొర్లవీడులోని దావాఖానలో వైద్యులు అందుబాటులో లేరు. ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్ విధుల్లో ఉన్నారు. అలాగే జంగేడులో దవాఖానను పరిశీలించగా విస్తుబోయే విషయం వెల్లడైంది. ఇక్కడ సిబ్బంది ఎవరూ హాజరు కాకపోవడంతో ఆస్పత్రి ప్రధాన గేటుకు తాళం వేసి ఉంది.

విద్యార్థినులతో కలెక్టర్ సహపంక్తి భోజనం



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మల్హర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) 28 : భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మండలంలో గురువారం పర్యటించారు. మల్లారంలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులతో ముఖాముఖి అయ్యారు. చదువులు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. బియ్యం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. మెనూను కచ్చితంగా పాటించాలని, భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో ప్రతి శుక్రవారం మండలంలోని విద్యాలయాల్లో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని సూచించారు. అనంతరం పెద్ద తూండ్ల, తాడిచర్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ఎంపీడీవో తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న సమగ్ర సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల ర్యాలీ, కళా ప్రదర్శనలను విజయవంతం చేయాలని కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు. గురువారం ఆయన జిల్లా అధికారులతో కలిసి ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్స్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజ యోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవ ర్యాలీ మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమై డీఎల్ఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రజా ప్రభుత్వం పిలిచింది పేరుతో అంతడుపుల నాగరాజు సారథ్యంలో కళాకారులు వివిధ కళారూపాలతో ప్రభుత్వ కార్యక్రమాలు, సంవత్సరకాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ ప్రజా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్, డీపీవో దేవరాజ్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీవో రహీం తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల కరదీపికన విడుదల

ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ ఆరోగ్యమిషన్, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య ఆరోగ్య అధికారుల కరదీపి కను కలెక్టర్ దివాకర తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ కరదీపికలోని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ఇన్‌చార్జి డెమో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమారస్వామి



సూరారంలో పశుగణనను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి

మహదేవపూర్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశుగణనను పకడ్బందీగా చేపట్టాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి అనోద కుమారస్వామి అన్నారు. మండలంలోని సూరారం, బెగ్లూర్ గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే అఖిల భారత పశుగణన ఈనెల 25న ప్రారంభమైందని తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు ఇది కొనసాగుతుందని అన్నారు. రెవెన్యూ గ్రామం యూనిట్‌గా పరిగణిస్తూ మండల వ్యాప్తంగా ఏడుగురు ఎన్యుమరేటర్లతో పశుగణన చేపడుతున్నట్టు తెలిపారు. తెల్ల, నల్లజాతి పశువులు, గొర్రెల, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువుల వివరాలతోపాటు రైతుల పేరు, అడ్రస్‌లను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పశు కిసాన్ క్రెడిట్ కార్డులపై రివ్యూ నిర్వహించి దరఖాస్తుల సంఖ్యపై ఆరా తీశారు. ఈకార్యక్ర మంలో మండల పశువైద్యాధికారి రాజబాబు, సిబ్బంది హరినా యక్, కల్యాణ్, నాగభూ షణం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో జ్యోతిబా పూలే వర్ధంతి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, ముంజంపల్లి మురళీధర్, రాజు, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, నాయకులు సెగ్గం సిద్ధు, మోతే రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' అడ్మిషన్ ఫీజు చెల్లింపుకు ప్రత్యేక గడువు

భూపాలపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌కు ప్రత్యేక ఫీజు గడువు కేటాయించినట్లు డీఈవో ఎం.రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు డిసెంబరు 2 నుంచి 11 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

న్యూస్ రీల్

రైతుల భూములను పరిశీలించిన ఆర్డీవో

మొగుళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతులు గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలో తమ విలువైన, సారవంతమైన భూములు కోల్పోతున్నామని ఆర్డీవో మంగీలాల్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆయన రంగాపురం గ్రామాన్ని సందర్శించి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో కోల్పోతున్న రైతుల భూములను పరిశీలించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జీపీని సందర్శించిన డీఎల్‌పీవో

కాటారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధి లో డీఎల్‌పీవో వీరభద్రయ్య గురువారం పర్యటించారు. జీపీ కార్యాలయంలో పలు రికార్డు లను, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులు నిరంతరం విరివిగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌ను ఆదేశించారు. జీపీ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కన్వీనర్ ఎమ్డీ.అమ్జద్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు గురువారం మండలంలోని కాసిందేవిపేట, జంగాలపల్లి, అంకన్నగూడెం, సర్వాపూర్‌లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమ్జద్‌పాషా మాట్లాడుతూ రైతులు 25రోజులుగా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలుకేంద్రాలకు తరలించినప్పటికీ అధికారులు షరతుల పేరుతో నేటివరకు కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకుముందు తడిసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక షరతులు విధించడం భావ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

వెంకటాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబరు 1వతేదీన జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాలల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జనగాం రవి పిలుపునిచ్చారు. మండలంలోని నల్లగుంటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షలమంది మాలలతో సింహగర్జన సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు కుక్కల నారాయణ, అంబటి నర్సయ్య, బండారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మంగపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని కమలాపురంలో గురువారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మల సమ్మయ్యకు చెందిన పాడిగేదె గోదావరి ఒడ్డు ప్రాంతంలో మేతమేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగిలి (అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

డీఎంహెచ్‌వోకు రెండో ఏఎన్ఎంల వినతి

ములుగు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోస్టులను పెంచి నియామకాలు చేపట్టాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో గోపాల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ డిసెంబరు 29న నిర్వహించే పరీక్షలకు గతంలో విడుదల చేసిన 1931 పోస్టులకు అదనంగా పెంచి నియామకాలు చేపట్టాలన్నారు. వయసురీత్యా అవకాశం లేని రెండో ఏఎన్ఎంలకు రూ.10లక్షల లైఫ్‌టైం గ్రాట్యుటీ కింద రిటైర్మెంట్ ఇవ్వాలని, వందశాతం గ్రాస్‌సాలరీ తక్షణమే అమలు చేయాలన్నారు. పరీక్ష రాసినా ఉద్యోగం పొందలేని వారికి వందశాతం గ్రాస్‌సాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పరీక్ష సిలబస్‌లో చేసే వర్క్ ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలని, ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాల రాజు, రెండో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.సరోజన, ఏఎన్ఎంలు కోడి సుజాత, కొమురం సుజాత, సంపూర్ణ, లక్ష్మి, స్వప్న, శోభారాణి, పావని, భాగ్య, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు తరలివెళ్లాలి

● వ్యవసాయ శాఖ జిల్లా అధికారి తేజోవతి

ములుగు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 28, 29, 30తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు పండగకు జిల్లాలోని రైతులు పెద్దసంఖ్యలో తరలివెళ్లాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి తేజోవతి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులకు చేకూరిన ప్రయోజనాలు, ఆధునిక వ్యవసాయ విధానాలు, ఆదర్శ రైతుల అనుభవాలు, ప్రసంగాలు, డ్రోన్ల వినియోగం, ప్రాముఖ్యత, శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలు, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల ప్రదర్శన, నూతన వంగడాలు, అధిక దిగుబడినిచ్చే వంగడాల ప్రదర్శన, వ్యవసాయ, ఉద్యానవన అనుబంధ రంగాల ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న పథకాల వివరాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

న్యాస్ సర్వేను విజయవంతం చేయాలి

చిట్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 4న నిర్వహించే న్యాస్ పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్ 2024 సర్వేను విజయవంతం చేయాలని జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రమేష్, ఏఎంవో కె.లక్ష్మణ్, ఎంఈవో రఘుపతి కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు, ఆరు, తొమ్మితో తరగతి విద్యార్థులకు విద్యా సామర్థ్యాలు లెక్కించేందుకు దేశ వ్యాప్తంగా నిర్వహించే పరీక్షలో నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. ఓఎంఆర్ షీట్లలో జాగ్రత్తగా బబ్లింగ్ చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆర్పీ రతన్‌సింగ్, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీరాం రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన

కాటారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట ఉద్యోగులు, సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో చల్ల సునీత, ఉపాధ్యాయులు అరుణ, సరిత, శిరీష, సుజాత, మణిమాల, రాజమణి, స్వప్న, రాజేశ్వరి, నళిని, శ్రీలత, లక్ష్మి, విజయ, మౌనిక, అనూష, సిబ్బంది దుర్గమ్మ, సమ్మక్క పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

ములుగు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ములుగులోని సంక్షేమ భవన్‌లో జిల్లా ఉపాధి కార్యాలయం, హైదరాబాద్ అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన 28మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా నలుగురు యువకులు అర్హత సాధించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధి అధికారి తుల రవి, అపోలో ఫార్మసీ హెచ్ఆర్ రఘుపతిలు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద ఉద్యోగం కోసం కాలయాపన చేయకుండా దొరికిన ఉద్యోగంలో చేరి అనుభవాన్ని గడించాలన్నారు. అనుభవంతో సొంతంగా పరిశ్రమలు, కంపెనీలు స్థాపించేందుకు ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య, రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

తాడ్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 3న ములుగు జిల్లాకేంద్రంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రంగు సత్యనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని నార్లాపూర్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని జిల్లా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ గీతకార్మికులకు సేఫ్టీ మోకులు, ద్విచక్రవాహనాలు అందించాలని, ఏజెన్సీ సొసైటీలను పునరుద్ధరించాలని, వృత్తి పింఛన్ అందించాలని, సభ్యత్వం గుర్తింపుకార్డులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు భూషణవేని రవికుమార్, సమ్మయ్య, నిమ్మల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు ఉండొద్దు : ఎస్పీ కిరణ్

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో కేసులను పెండింగ్‌లో ఉంచుకుండా సత్వరమే పరిష్కరించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీసు అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తదితర తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల విచారణను త్వరగా పూర్తి చేసి చార్జీషీటు దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసుకూ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని విధులు నిర్వర్తించాలన్నారు. దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారినిగుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టి కిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలక విరుద్ధంగా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఘనంగా పూజలు



దీపోత్సవంలో భక్తులు, అర్చకులు

మహదేవపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో గురువారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపు సమర్పించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు చేశారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపాదానం అందజేశారు.

ఘనంగా దీపోత్సవం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం గురువారం సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులతో సామూహిక దీపోత్సవాన్ని చేపట్టారు. మహిళలకు దీపాలు, వత్తులు, నూనె, ఇతర పూజా సామాగ్రిని ఆలయం నుంచే ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చిట్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను మండల కేంద్రంలో గురువారం దహనం చేశారు. ఈసందర్భంగా నగర కమిటీ కన్వీనర్ బుర్ర అభిజ్ఞ మాట్లాడుతూ నూతన ఏడాది కాలంలో 51 మంది విద్యార్థులు మృతి చెందినా ప్రభుత్వంలో స్పందన లేకపోవడం దారుణమన్నారు.. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంఘం బాధ్యులు అజయ్, అవినాష్, రోహిత్, హరీష్‌కుమార్, శిత తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ వల్ల మరణించడటాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈసంద ర్భంగా జాతీయ రహదారిపై బైఠాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా విద్యార్థులు జీవితాలతో ప్రభుత్వం చెలగాటాడుతోందని విమర్శించారు. చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండి పడ్డారు. ఈకార్యక్రమంలో రఘు, సాయి, వరుణ్, విష్ణు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంగా మల్లంపల్లి

(5వ పేజీ తరువాయి)

మండల ఏర్పాటుకు ప్రభుత్వం తుది గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే.. గెజిట్‌లో కేవలం 'మల్లంపల్లి మండలం' అని పేర్కొనడం గమనార్హం.

హోరెత్తిన సంబురాలు

మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఫైనల్ నోటిఫికేషన్ జారీ కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మల్లంపల్లిలో సంబరాలు మిన్నంటాయి. గురువారం రాత్రి బాణసంచా కాల్చి, మిఠాయి పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత ఎదురైన సమస్యలను అధిగమించి ఇచ్చిన మాటకు కట్టుబడి మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సహకరించారని తెలిపారు.

లైంగిక దాడులపై అవగాహన ర్యాలీ

భూపాలపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగికదాడులపై భూపాలపల్లి పట్టణంలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్, సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైల్డ్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శైలజ హాజరయ్యారు. బాలికలపై, మహిళలపై జరుగుతున్న లైంగిక సామాజిక వేదింపుల దాడులను ఖండిస్తూ అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక పక్షోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మహిళలు ఎక్కడ పూజింపబడుతారో అక్కడ దేవతలు కొలువుదీరుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, గాయత్రి, ఈశ్వరి, శైలజ, కోమల, అశోక్, వెన్నల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కన్నాయిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుర్రేవుల జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో గురువారం క్రీడా దుస్తులను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపయ్య, ఉపాధ్యాయులు జమున, శ్యాంసుందర్, కవిత, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో సీపీఎం మహాసభలు

గోవిందరావుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏటూరునాగారంలో డిసెంబరు 6,7 తేదీల్లో నిర్వహించే సీపీఎం ములుగు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి కోరారు. మండలకేంద్రంలో అంబాల మురళి అధ్యక్షతన గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు గొంది రాజేష్, కడారి నాగరాజు, అమ్జద్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎదుర్కొంటున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు

లేబర్ యూనియన్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి కోలా నాగేంద్రబాబు



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న నాగేంద్రబాబు

కాకతీయఖని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి కోలా నాగేంద్రబాబు అన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఓసీ-3 వద్ద ఆయన కాంట్రాక్టు కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనరం విలేకరులతో మాట్లాడారు. ఏరియాలోని ఓసీ-3లో 81 మంది కార్మికులు బాస్టింగ్ పనిలో చేస్తున్నారని, మరో 20మంది సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నారని అన్నారు. వీరికి నాసిరకం బూట్లు ఇస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కార్డులు లేవని, కొంతమందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి ఎగ్గొట్టారని అన్నారు. ప్రతినెలా మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాల్సి ఉండగా 18 నుంచి 20 వరకు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతాలు ప్రారంభిస్తే వారికి రూ.30 లక్షల బీమా సౌకర్యం లభిస్తుందని, కాంట్రాక్టరు కార్మికులకు మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. ఓసీలో వాటర్ కొట్టడం లేదని, దుమ్ముదూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అన్నం తినడానికి కనీసం షెడ్డు లేక లారీలు, టిప్పర్ల పక్కన కూర్చొని తినాల్సిన దుస్థితి ఉందన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలు ఎవరికైనా చెప్పుకుంటే వారిని విధుల్లో నుంచి తొలగిస్తారేమోననే భయాందోళన తో కాంట్రాక్టు కార్మికులు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వారి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.